# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 22-11-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **శ్రీ సత్యసాయిబాబా బోధనలు అనేక మందికి మార్గం చూపాయని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు.**

2. **కొత్తగా అమల్లోకి వచ్చిన లేబర్ కోడ్స్ ద్వారా ఉద్యోగుల భద్రత మరింత బలోపేతం అవుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**

3. **అమరావతి రాజధానిలో అసైన్డ్ ల్యాండ్స్ సమస్యలను త్వరలో పరిష్కరించనున్నట్లు కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు.**

4. **అమరావతిలో సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి పి.నారాయణ అధికారులను ఆదేశించారు.**

===========================

శ్రీ సత్యసాయిబాబా బోధనలు అనేక మందికి మార్గం చూపాయని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో జరుగుతున్న బాబా వారి శత జయంతి వేడుకల్లో ఈరోజు రాష్ట్రపతి పాల్గొని ఆయన మహా సమాధి వద్ద నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రపతి మాట్లాడుతూ.. సత్యసాయి సందేశంతో కోట్ల మంది భక్తులు మానవసేవ చేస్తున్నారని, ఆయన తన సందేశంతో అనేక మందిని సేవామార్గంలో నడిపించారని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము తెలుపుతూ..

వాయిస్.. 23 సెకన్లు

శ్రీ సత్యసాయిబాబా తన సందేశాలతో చాలామందిలో పరివర్తన తెచ్చారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో జరుగుతున్న శ్రీ సత్యసాయి బాబా శత జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పుట్టపర్తి పరిసరాల్లో నీటి సమస్య లేకుండా అనేక ప్రాజెక్టులు నెలకొల్పారని, సత్యసాయి సిద్ధాంతం ప్రపంచమంతా వ్యాపించిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొంటూ...

వాయిస్.. 33 సెకన్లు

-------------------------

కొత్తగా అమల్లోకి వచ్చిన లేబర్ కోడ్స్ ద్వారా ఉద్యోగుల భద్రత మరింత బలోపేతం అవుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. భారత దేశం అభివృద్ధి పథంలో ఇది ఒక మైలురాయి అని ఆయన 'ఎక్స్' వేదికగా ఒక పోస్టులో పేర్కొన్నారు. 1991 ఆర్థిక సంస్కరణల తర్వాత అత్యంత కీలక మార్పులుగా ఇవి నిలుస్తాయని ముఖ్యమంత్రి అభిప్రాయ వ్యక్తం చేశారు. భారత కార్మిక విధానాలను అంతర్జాతీయ ప్రమాణాలకు దగ్గరగా తీసుకువచ్చే కీలక అడుగు ఇది అని వివరించారు.

-------------------------

అమరావతి రాజధానిలో అసైన్డ్ ల్యాండ్స్ సమస్యలను త్వరలో పరిష్కరించనున్నట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. రాజధాని రైతుల సమస్యలపై అమరావతిలోని సీఆర్డీఏ కార్యాలయంలో రైతులతో త్రిసభ్య కమిటీ ఈరోజు సమావేశం అయింది. ఈ సమావేశంలో రాజధానిలో రైతుల సమస్యలు, ప్లాట్ల కేటాయింపుపై చర్చించారు. రైతుకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పాత్రికేయులతో పేర్కొంటూ...

వాయిస్ .. 35 సెకన్లు

-------------------------

అమరావతిలో సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ అధికారులను ఆదేశించారు. సీడ్ యాక్సెస్ రోడ్డులోని కొండవీటి వాగు, గుంటూరు ఛానల్, బకింగ్ హాం కెనాల్స్ పై నిర్మిస్తున్న బ్రిడ్జ్‌లను మంత్రి అధికారులతో కలిసి ఈరోజు పరిశీలించారు. కొండవీటి వాగు ఎత్తిపోతల వద్ద జరుగుతున్న స్టీల్ బ్రిడ్జి నిర్మాణం వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు.

-------------------------

గోవాలో జరుగుతున్న 56వ భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవం -ఇఫీ మూడవ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా వేవ్స్ ఫిల్మ్ బజార్‌లో జమ్మూ కశ్మీర్ సమాచార, ప్రజా సంబంధాల డైరెక్టరేట్ ఆధ్వర్యంలో ప్రత్యేక జమ్మూ కాశ్మీర్ పెవిలియన్‌ను ఏర్పాటు చేశారు. ఈ పెవిలియన్ ద్వారా జమ్మూ కాశ్మీర్‌లో చలన చిత్ర విశేషాలను తెలియజేయడంతో పాటు ఆ ప్రాంతంలో చిత్రీకరణకు అనుకూలమైన సుందరమైన ప్రదేశాలు, చలన చిత్ర పరిశ్రమ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు తదితర అంశాలను ప్రదర్శిస్తున్నారు. అలాగే ఈ ప్రాంతాన్ని ప్రధాన షూటింగ్ గమ్యస్థానంగా ప్రోత్సహించే లక్ష్యంతో కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను గురించి ఈ పెవిలియన్ తెలియజేస్తుంది.

-------------------------

దేశంలో కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన నాలుగు కార్మిక చట్టాల అమలును పలు పరిశ్రమలు, సంస్థలు స్వాగతిస్తున్నాయి. ఈ చర్యతో ఉద్యోగుల భద్రత మరింత బలోపేతం అవుతుందని, కార్మికుల వేతనాలకు హామీ ఉండడంతో పాటు వారి హక్కులకు ప్రాముఖ్యత లభిస్తుందని ఆయా సంస్థల అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. వేతనాల కోడ్ - 2019, పారిశ్రామిక సంబంధాల కోడ్ -2020, సామాజిక భద్రత కోడ్ - 2020, వృత్తి భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్ వంటి కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం నిన్న అమల్లోకి తీసుకొచ్చింది. ఈ సందర్భంగా భారతీయ మజ్దూర్ సంఘ్ కార్యదర్శి గిరీష్ ఆర్య మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత

కార్మికులకు అనుకూలంగా తీసుకున్న అతిపెద్ద సంస్కరణ ఇది అని చెప్పారు. ఇవి కార్మికులకు సాధికారత కల్పిస్తాయని పేర్కొంటూ...

వాయిస్..18 సెకన్లు

----------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 128వ సంచిక ఈనెల 30వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. "మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 28వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

----------------------------

వెనుకబడిన తరగతులకు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షలకు అర్హత గల అభ్యర్థులకు విజయవాడలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు అనంతపురం జిల్లా ఏపీ బీసీ స్టడీ సర్కిల్ సంచాలకులు కుష్బూ కొఠారి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 25వ తేదీ లోపు అనంతపురంలోని బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో దరఖాస్తులను ఇవ్వాలని అన్నారు. మరిన్ని వివరాల కోసం 95502 50770 కు ఫోన్ ద్వారా సంప్రదించాలని సూచించారు.

----------------------------

దక్షిణాఫ్రికా, భారత్ జట్ల మధ్య రెండవ టెస్ట్ క్రికెట్ మ్యాచ్ అస్సాంలోని గౌహతిలో ఈరోజు ప్రారంభమైంది. మొదట టాస్ గెలిచిన దక్షిణాఫ్రికా బ్యాటింగ్ ఎంచుకుంది. మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి దక్షిణాఫ్రికా 2 వికెట్లు నష్టపోయి, 130 పరుగులు చేశారు. బవూమా 32 పరుగులు, ట్రిస్టన్ స్టబ్స్ 28 పరుగులతో బ్యాటింగ్ చేస్తున్నారు. బూమ్రా, కులీదీప్ యాదవ్‌లు చెరో వికెట్ తీశారు.

----------------------------

బంగాళాఖాతంలో అండమాన్ సమీపంలో ఈరోజు అల్పపీడనం ఏర్పడే అవకాశముందని భారత వాతావరణ విభాగం తెలిపింది. ఇది పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతూ సోమవారం నాటికి దక్షిణ మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా మారుతుందని, తర్వాత అదే దిశలో పయనిస్తూ.. ఈనెల 26వ తేదీ నాటికి నైరుతి బంగాళాఖాతంలో తుఫానుగా బలపడే అవకాశముందని పేర్కొంది. దీని ప్రభావంతో రానున్న 3 రోజుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని అమరావతిలోని వాతావరణ కేంద్రం వెల్లడించింది.

=====================